

21న పుష్పగిరిలో గిరి ప్రదర్శన

ప్రజాశక్తి- చెన్నూరు : సద్గురు శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 12వ తరం వారసులు తిరుమల శ్రీవారి అన్నమయ్య సంకీర్తన కైంకర్యా పరులు హరి నారాయణ చార్యులు(తాళ్లపాక స్వామి) ఈనెల 21వ తేదీ ఆచాడ మాసం పౌర్ణమి రోజు ఉదయం పుష్పగిరి క్షేత్రంలో గిరి ప్రదర్శనలో పాల్గొంటున్నట్లు పుష్పగిరి తీర్థ క్షేత్ర గిరి ధర్మ పరిరక్షణ సమితి కార్యనిర్వహకులు ఆవుల బసిరెడ్డి తెలిపారు. చెన్నూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుమల నుంచి ఉదయం పుష్పగిరి చేరుకొని గిరి ప్రదర్శనలో పాల్గొన్న అనంతరం శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి, శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి పౌర్ణమి లాగానే ఆషాడ మాసం పౌర్ణమికి ఎంతో విశిష్టత ఉందని తెలిపారు. గిరి ప్రదర్శనకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గిరి ప్రదర్శనకు వచ్చే భక్తుల కోసం చెన్నూరులో ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అల్లాడుపల్లెలో డయేరియా విజృంభణ



చికిత్స పొందుతున్న అల్లాడుపల్లెకు చెందిన చిన్న పిల్లలు, మహిళ

- రెండు రోజులుగా ఆస్పత్రి పాలైన చిన్నపిల్లలు
- ప్రొద్దుటూరులో పలు ఆస్పత్రుల్లో చికిత్స
- ఒకరి పరిస్థితి విషమం..కర్నూలుకు తరలింపు
- పట్టని అధికారులు - ఆందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి -చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో డయేరియా విజృంభిస్తోంది. ఆరు నెలల పిల్లల నుంచి గర్భిణుల వరకు ప్రతి ఒక్కరూ డయేరియా బాధితులుగా మారారు. గ్రామంలో అపరిశుభ్రత నెలకొని ఉండడం, ట్యాంక్ ద్వారా సరఫరా ఆయిన నీటిని తాగడం వలన డయేరియా బారిన పడినట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రానికి వెళ్లే చిన్నపిల్లలు, గర్భిణులు డయేరియా బారిన పడ్డారు. రెండు రోజులుగా ప్రొద్దుటూరులోని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులకే పరిమితమయ్యారు. చిన్న పిల్లల ఆరోగ్య పరిస్థితి తలుచుకుంటూ తల్లిదండ్రులు విలవిలలాడిపోతున్నారు. ప్రయివేట్ వైద్యశాలలో అధిక ఫీజులు చెల్లించుకోలేనప్పట్టికీ పిల్లల పరిస్థితి చూసి తప్పని పరిస్థితులలో వైద్యం అందిస్తున్నారు. రెండు రోజులుగా ఆసుపత్రులలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. 15 మందికిపైగా చిన్న పిల్లలు డయేరియాతో ఇబ్బంది పడుతుంటే వారిని పలకరించిన నాథుడే కరువయ్యాడు. చిన్నపిల్లలు ప్రొద్దుటూరులో చికిత్స పొందుతుంటే ప్రభుత్వ అధికారులు గురువారం తూతూ మంత్రంగా గ్రామంలో పర్యటించి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందలేదని కూలినాలి చేసుకొని జీవిస్తున్న మాకు వైద్య ఖర్చులు భారంగా మారాయని పిల్లల తల్లిదండ్రులు పేర్కొన్నారు. 15 నెలల శివ నిహాంత్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసియులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆరు సంవత్సరాల శరత్ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్షర, యశ్వంత్, విశ్వతేజ, నిఖిల్, త్రివిక్రమ్, నేహాంత్, అన్విత, విష్ణుకాంత్, మోహిత్ ప్రొద్దుటూరు ప్రయివేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. వీరితోపాటు నాలుగు నెలల గర్భిణి లక్ష్మి డయేరియాతో చికిత్స పొందుతున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని బాధితులు కోరుతున్నారు. గ్రామంలో అపరిశుభ్రత తొలగించి శుభ్రమైన నీటిని తరపున చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం ప్రయివేట్ వైద్యశాలలో డయేరియాకు ఆరోగ్యశ్రీ కింద ఉచిత చికిత్స అందించాలని కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న అల్లాడుపల్లెకు చెందిన చిన్నారి

దళితులకు అన్యాయం చేస్తే సహించం : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి-కడప అర్బన్

దళితులకు ఎక్కడా అన్యాయం చోటు చేసుకోకూడదని, జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ శివశంకర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కమిటీ సభ్యులైన అధికారులను ఆదేశించారు. ఈ కమిటీలో బాధితులకు పరిష్కారం అందించడం ఒక ఎత్తయితే, భవిష్యత్తులో అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ దిశగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, భయాందోళనలు జరగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం జరగకుండా చర్యలు చేపడుతోందన్నారు. దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని చెప్పారు. ఎక్కడ వారు అన్యాయానికి గురి కాకుండా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ప్రతినెలా 30వ తేదీన నిర్ణయించిన పౌర హక్కుల దినోత్సవం నాడు ఒక్కో మండలంలోని ప్రధాన పాఠశాలలో విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు, ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని అట్రాసిటీ కేసులు నమోదుకాకుండా అవగాహన పెంచాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ జిల్లాలో అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం పైన ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బాల్య వివాహాలను అరికట్టే దిశగా చర్యల్లో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు మండల స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, అన్ని డివిజన్ల ఆర్‌డిఒలు, సంబంధిత డిఎస్‌పిలు, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, ఎస్‌సి కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్ ఇడి డాక్టర్ వి.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పూర్వ ఆర్‌జెడి రాఘవరెడ్డి అవినీతిపై విచారణ

- ఆధారాలు సమర్పించిన యుటిఎఫ్ నాయకులు



ఆధారాలు సమర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

పూర్వ ఆర్‌జెడి వై.రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై డిఇఒ కార్యాలయంలో గురువారం విచారణ అధికారి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ డాక్టర్ ఎంఆర్.ప్రసన్న కుమార్ ఆరోపణలపై విచారణ చేపట్టారు. రాఘవరెడ్డి కడప జిల్లాలో విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే వివాదాస్పద అధికారిగా పేరు గాంచారు. అధికార పార్టీ అండదండలు తనకున్నాయనే ప్రచారంతో ఉపాధ్యాయుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, ఉపాధ్యాయులను వేధించడం, ప్రశ్నించిన వారిని అక్రమంగా సస్పెన్షన్లు చేయడం, షోకాజు నోటీసులు జారీ చేయడం పరిపాటిగా మారింది. ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు రాఘవరెడ్డి వైఖరిపై గళమెత్తారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కలెక్టర్, గవర్నర్‌కు రాఘవరెడ్డి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. రాఘవరెడ్డికి అధికార పార్టీ అండదండలు ఉండడంతో అవినీతిపై చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి రావడంతో రాఘవరెడ్డిపై గతంలో ఎమ్మెల్సీతో పాటు ఉపాధ్యాయ సంఘాలు చేసిన ఫిర్యాదుపై ప్రసన్న కుమార్‌ను విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ ఆరోపణలపై గురువారం విచారణ అధికారి విచారణ చేపట్టారు. గతంలో ఫిర్యాదు చేసిన యుటిఎఫ్ సంఘాన్ని విచారణ అధికారి విచారణకు పిలవడంతో యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు విచారణకు హాజరై అవినీతి, అక్రమాలపై పలు ఆధారాలను విచారణాధికారికి సమ ర్పించారు. ఈ సందర్భంగా విచారణ అధికారితో వారు మాట్లాడుతూ వై.రాఘవరెడ్డి జిల్లాలో డిఇఒగా నియమించ బడినప్పటి నుంచి అవినీతి అక్రమాలే పరమావధిగా కొనసా గారన్నారు. ఉపాధ్యాయులను దూషించడం, ప్రశ్నించిన వారిని సస్పెండ్ చేయడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఆయన నైజమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యా యులు తమ సమస్యలపై ఆందోళన చేపట్టడానికి వీలు లేదంటూ వివాదాస్పద ఉత్తర్వులు జారీ చేసి తన పెత్తందారి పోకడలను విద్యాశాఖలో ప్రవేశపెట్టారన్నారు. గత ఏడాది జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో చేతివాటం ప్రదర్శించి ఇష్టా రాజ్యంగా తనకు అనుకూలురైన వారికి అనుకూలమైన స్థానాలు కట్టబెట్టాడని తెలిపారు. విద్యాశాఖను ప్రభుత్వ సంస్థగా కాకుండా, తన సొంత జాగీరుగా మార్చివేశారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తనకు అర్హత లేకపో యినా యుజిసి స్కేల్‌ను అక్రమంగా పొందాడని, ఈ విషయంలో పాఠశాల విద్యా కమిషనర్ అక్రమంగా పొందిన అదనపు వేతనాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని ఆదేశాలు ఇచ్చినా పెడచెవిన పెట్టారని విమర్శించారు. డిఇఒగా ఆయనపై పలు ఆరోపణలున్నా కడప జిల్లాలోనే ఆర్‌జెడిగా పదోన్నతి కల్పించారని తెలిపారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో పాటు ఎయిడెడ్ ఉపాధ్యాయులను, కరస్పాండెంట్‌లను సైతం ఆయన వేధించారని వివరించారు. ప్రభుత్వం స్పందించి పూర్వ ఆర్‌జెడిని ప్రభుత్వానికి సరెండర్ చేయడం మంచి పరిణామమైనా, ఆయన చేసిన అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విచారణ అధికారికి విజ్ఞప్తి చేశారు. విచారణ అధికారి ఎంఆర్.ప్రసన్నకుమార్ స్పందిస్తూ రెండు రోజులపాటు పూర్వ ఆర్‌జెడిపై వచ్చిన ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. విచారణకు పలు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో పాటు పలువురు బాధితులు విచారణకు హాజరై రాఘవరెడ్డి వైఖరిపై ఫిర్యాదులు చేశారు.

'పెట్టుబడి సాయం రూ.20 వేలు జమచేయాలి'



చింతకొమ్మదిన్నె : సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి కోరారు. గురువారం మండలంలోని కొలుమలపల్లె గ్రామ సచివాలయం కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావంతో ఒకవైపు కరువైతే, మరోవైపు డిసెంబర్‌లో వచ్చిన తుఫాన్‌తో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని పేర్కొన్నారు. సున్నా పావలా వడ్డీ రాయితీలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వడ్డీ అసలు కట్టలేని రైతులపై బ్యాంకులో ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీ రాయితీ విడుదల చేసి రైతుల ఖాతాలో వేయాలని తెలిపారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, రైతు సంఘం నాయకులు చిన్న సిద్దయ్య, రంగారెడ్డి పాల్గొన్నారు. **అట్లూరు:** వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మికులను ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దుర్గయ్య, రమణ డిమాండ్ చేశారు. మండలంలోని కమలకూరు సచివాలయం అధికారి వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుభద్ర, మాధవి, లక్ష్మీదేవి, యేసు, కమలకూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **కాశినాయన:** వర్షాల వల్ల నష్టపోయిన రైతు కౌలు రైతు వ్యవసాయ కారణాలకు వెంటనే నష్టపోయారు చెల్లించాలని వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య పేర్కొన్నారు. డిప్యూటీ తహశీల్దార్ ప్రసన్నకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నష్టపోయిన కూడా ఎలాంటి ఫలితం ఇవ్వలేదని, అలాంటి రైతులకు వెంటనే చెల్లించాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల నుండి 200 రోజులు పనిదినాల పెంచాలని తెలిపారు

కిడ్నీ బాధితులకు ఉచితంగా డయాలసిస్

ప్రజాశక్తి- గోపవరం

బద్వేల్ పట్టణంలో స్థానిక క్లస్టర్ వైద్యశాలలో డయాలసిస్ విభాగంలో కిడ్నీ బాధితులైన పేదలందరికీ ఉచితంగా చికిత్స అందించబడునని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, రాహి కేర్ మేనేజర్ మంగలి సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక బద్వేల్ డయాలసిస్ హాస్పిటల్లో వారు విలేకరులతో మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే డాక్టర్ వెంకటసుబ్బయ్య మెమోరియల్ డయాలసిస్ ఆసుపత్రిలో కిడ్నీ బాధితులైన పేదలందరికీ రోజుకు 15 మందిపైగా డయాలసిస్ సేవలు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇంకా ఎక్కువ మందికి సేవ జరగాలంటే ఇంకా నాలుగైదు మిషన్లు ఏర్పాటు చేస్తే బద్వేలు పరిసర ప్రాంతంలోని కిడ్నీ బాధితులైన పేదలందరూ దూర ప్రదేశాలకు పోవలసిన అవసరం లేకుండా ఇక్కడే సేవలను వినియోగించుకో వచ్చుని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భావనశ్రీ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ అభివృద్ధికి కృషి చేస్తాం

ప్రజాశక్తి-కాశినాయన

కాశినాయన జ్యోతి క్షేత్ర ఆలయ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె తన అనుచరులతో జ్యోతి క్షేత్రాన్ని సందర్శించి మాట్లాడుతూ ఇక్కడ కొన్ని సంవత్సరాల నుండి ఆలయ నిర్మాణం పనులు ఆగిపోయినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు ఇక్కడ కాశినాయన భక్తులను ఆయ కమిటీ వారిని ఇబ్బంది పెడుతోందన్నారు. అధికారులతో మాట్లాడి ఆలయనిర్వాహ పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, ఆలయ నిర్వహకుడు చెన్నారెడ్డి, నాయకులు బొజ్జరోసన్న, రితిష్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, పోలిరెడ్డి,రవీంద్రారెడ్డి, శ్రీనివాసులురెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

జైళ్ల శాఖ డిఐజిని కలిసిన కెనరా బ్యాంక్ ఆర్ఎం

ప్రజాశక్తి - కడప

జైళ్ల శాఖ డిఐజిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వరప్రసాద్‌ను గురువారం కెనరా బ్యాంక్ కడప రీజినల్ మేనేజర్ మురళీమోహన్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్ కెనరా బ్యాంక్ యొక్క పథకాల గురించి, ఉద్యోగులకు కెనరా బ్యాంక్ అందిస్తున్న పథకాల గురించి డిఐజి వరప్రసాద్‌కు వివరించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ కడప రీజినల్ ఆఫీస్ డివిజనల్ మేనేజర్ ఎస్.రమేష్, టి.సుజిత్ కుమార్, మేనేజర్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

ప్రతి ఒక్క వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించి ప్రమాదాలను నివారించాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. గురువారం కడప నగరంలో వన్ కే వాక్ నిర్వహించారు. కడప నగరం ఐటిఐ సర్కిల్ నుండి బిల్టప్ సర్కిల్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ వాడకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో కోర్టు బార్ ప్రెసిడెంట్ బొగ్గుల గుర్రప్ప నాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హరిబాబు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.తిమ్మయ్య, కోర్టు కానిస్టేబుల్ పుల్లయ్య, పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు సురేష్ సహాయం, శ్రీనివాసులు శిరీష, ఈశ్వరయ్, దశరథ రామిరెడ్డి, కోర్టు సిబ్బంది, శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

'దాడులపై ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం'

ప్రజాశక్తి-కడప అర్బన్

దళితులపై దాడులు ఆపకపోతే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమని, పెన్నపేరూరు దళితుడు కదిరి ప్రభాకర్ ఏంజరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని కడప జిల్లా దళిత ఫోరం చైర్మన్ కిశోర్ కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో దళిత ఫోరం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దళితులపై దాడులు తీసుకోవాల్సిన చర్యలు అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభాకర్‌పై వేడి నూనెతో దాడి జరిగి పది రోజులు కావస్తున్నా సిఎం, హోం మంత్రి ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. దళితులపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. ప్రభాకర్‌కు జరిగిన నష్టానికి ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, జీవనోపాధి కోసం మూడు ఎకరాల సాగు భూమి, రూ.20 లక్షలు నష్టం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు బి.నారాయణ మాట్లాడుతూ సామాజిక రుగ్మతలు, అసమానతలు తొలగించేందుకు పాలకులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బిఎస్‌పి నాయకులు సగిలి గుర్రప్ప మాట్లాడుతూ పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా దళితులు, బడుగు వర్గాల ప్రజలుపై శారీరకంగా, మానసి కంగా, అంటరానితనం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ ఎస్సీ, ఎస్టీ హ్యూమన్ రైట్స్ ఫోరం కన్వీనర్ జె.వి.రమణ మాట్లాడుతూ గ్రామానికి పోలీసులు కానీ, ప్రభుత్వ అధికారులు పోకపోవడం వల్ల దళితుల పట్ల వారి నిర్లక్ష్యం అర్థమవుతోందిని పేర్కొన్నారు. చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ అవ్వారు మల్లికార్జున మాట్లాడుతూ బాధితుడు ప్రభాకర్‌కు మెరుగైన వైద్యం అందించాలన్నారు. టిడిపి దళిత నాయకుడు కొండా సుబ్బయ్య మాట్లాడుతూ బాధితుడు ప్రభాకర్ నీరసంతో అరుగు మీద కూర్చున్నంత మాత్రాన ఇలాంటి దాడులకు దిగడం సరైంది కాదన్నారు. సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శులు వెంకట శివ, రామ్మోహన్ మాట్లాడుతూ దాడి వెనుక రాజకీయ కోణాలు ఉన్నప్పటికీ ఇలాంటి దాడులు హేయమైన చర్యగా అభివర్ణించారు. హేతు వాద సంఘం నాయకులు సిఆర్‌వి ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి దాడులు భవిష్యత్తులో ఉత్పన్నం కాకుండా ఉండాలంటే దళితులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు డబ్ల్యూ రాము, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మునెయ్య, మాల మహా నాడు జిల్లా అధ్యక్షుడు గోర్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నారాయణ, వెంకట రమణ, రవికుమార్,అంజి, రెడ్డెయ్య పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంపై అవగాహన : జెవివి

ప్రజాశక్తి-కడప అర్బన్

శాస్త్రీయ దృక్పథంపై గురువారం కడప గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు జెవివి నాయకులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రీయ అవగాహన, ప్రయోగాలు, సైన్స్ వివరణ, ఉదాహరణలతో నాయకులు వివరించారు. మేజిక్ షో, దాని వెనుక దాగివున్న లాజిక్ తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ జెవివి నాయకులు సునీత, అరుణ, కడప నగర అధ్యక్షుడు శివరాం, కడప జిల్లా అధ్యక్షులు పోలంకి శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాల బయన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డివైఎఫ్ఐ జిల్లా వర్క్‌షాప్

ప్రజాశక్తి-కడప అర్బన్

డివైఎఫ్ఐ కడప జిల్లా వర్క్ షాప్ ఈ నెల 19న బద్వేల్ పట్టణం సుందరయ్య భవన్‌లో నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేలులో జరిగే డివైఎఫ్ఐ వర్క్‌షాప్‌లో భవిష్యత్ కార్యక్రమాల గురించి చర్చిస్తారని పేర్కొన్నారు. ప్రధానంగా విభజన హామీలు అమలు, కడప ఉక్కు, రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, నిరుద్యోగ సమస్య, జిల్లా అభివృద్ధి గురించి ఈ వర్క్‌షాప్‌లో చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు.

రేపు డయల్ యువర్ ఆర్‌టిసి ఆర్ఎం

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆర్‌టిసి సమస్యలపై డయల్ యువర్ ఎపిఎస్ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యక్రమం ఈ నెల 20వ తేదీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్‌టిసి ప్రజా రవాణా అధికారి(డిపిటిఒ) పి.గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఆర్‌టిసి సమస్యలపై డయల్ యువర్ జిల్లా ప్రజా రవాణా అధికారి (ఆర్ఎం) కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను 9959225848 సెల్ నంబరుకు ఫోన్ చేసి కానీ, వాట్సాప్ చేయాలని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని ప్రయాణికులు, ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వైవీయూ ఇన్‌ఛార్జి విసిగా కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగివేమన విశ్వావిద్యాలయం ఇన్‌ఛార్జి విసిగా కృష్ణారెడ్డిని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ప్రిన్సిపల్‌గా, ప్రస్తుతం వైవీయూ ఒకేషనల్ కోర్స్ అధికారిక కొనసాగుతున్నారు. విసి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-పెండ్లిమర్రి

ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి అని స్టెప్ సిఇఒ సి.సాయి గ్రేస్, రిటైర్డ్ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గుణ శేఖర్ అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఇసుకపల్లి, ఎగువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం-కెరీర్ కౌన్సిలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం అనగా ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని, తరువాత వారి యొక్క మనస్సు చదువు, కళలు, క్రీడలు పట్ల ఏకాగ్రత కలిగి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. దేశ జనాబాలో యువత 33 శాతం ఉన్నారని తెలిపారు. ప్రపంచంలో ఏ ఇతర దేశంలో యువత ఇంత శాతం లేదని తెలుపుతూ, యువజన సర్వీసుల శాఖ స్టెప్ ద్వారా యువతకు వ్యక్తిత్వ వికాసంతో పాటు కళలు, క్రీడలు, దిశా యాప్ మొదలగు వాటి గురించి అవగాహనా కార్యక్రమాలు వివిధ కళాశాలల నందు విరివిగా నిర్వహిస్తూనామని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్లు కె.అపర్ణ, శివమోహన్, ఉపాధ్యాయులు, స్టెప్ మేనేజర్ వి.వి.సుబ్బరాయుడు, జూనియర్ అసిస్టెంట్ టి.నాగయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కడప

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరు విధిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ సూచించారు. గురువారం విద్యుత్ ప్రమాదాల నివారణపై కడప విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజిలెన్సు విభాగం సిఐ దారెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి రమణ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో పంటపొలాలకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. విద్యుత్‌ను సరైన పద్ధతిలో భద్రతా నియమాలు పాటించి వాడుకుంటే సౌకర్యంగా విలాసవంతంగా ఉంటుందని తెలిపారు. గ్రామాలలో కొంతమంది విద్యుత్తుని కొక్కెముల ద్వారా వైరు మధ్యలో తీసుకోవడం వలన అవి తెగి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టుటకు ప్రజలలో అవగాహన కల్పించుటకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఐటిఐ లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో మెకానిక్ మోటర్ వెహికల్ ట్రేడ్ లెక్చరర్ రాజశేఖర్ విద్యార్థులను వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజుకు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కడప నగరంలోని రాజశేఖర్ విద్యార్థులతో మద్యం, ఇంట్లోకి కూరగాయలు తెప్పించుకుంటూ వేధిస్తున్నాడని తెలిపారు. అతను చెప్పిన పనిచేయకుంటే కళాశాలలో హాజరు శాతం తక్కువగా ఉందని చెప్పి విద్యార్థులను ఇంటికి పంపిస్తూ వేధిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులతో మద్యం తెప్పించుకోడం ఏమిటని అడిగితే ఎడి, తాను కలిసే మద్యం తగుతామని అతను తెప్పించమంటేనే తను మద్యం తెప్పించానని, మీరు ఎవరికైనా పిర్యాదు చేసుకోండి నాకు ఏమి కాదు అని రాజశేఖర్ విద్యార్థులతో చెప్పడం దారుణమన్నారు. లెక్చరర్‌పై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భూ అక్రమార్కులపై చర్యలు చేపడతాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కడప అర్బన్

వైసిపి ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు సాగించిన భూ దందాలపై తగిన చర్యలు చేపట్టి కొల్లగొట్టిన ప్రభుత్వ ధనాన్ని తిరిగి ప్రభుత్వ ఖజానాకు జమ చేసేలా చర్యలు చేపడతామని కడప ఎమ్మెల్యే మాధవి తెలిపారు. గురువారం కడప నగరంలోని ద్వారకా నగర్ లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో గత పాలకులు సాగించిన అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ముఖ్యంగా ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం చేసిన భూ దందాలు అన్నీ ఇన్నీ కావన్నారు. భూములు, కొండలు, గుట్టలను దోచుకున్నారని చెప్పారు. వైసిపి పాలనలో 1.75 లక్షల ఎకరాలు భూ ఆక్రమణలు జరగ్గా, వాటి విలువ 35 వేల కోట్ల పైచిలుకు ఉంటుందన్నారు. ఇంటి పట్టాల పేరుతో తక్కువ ధరకు దాదాపు 10 వేల ఎకరాలకు పైగా భూములను కొనుగోలు చేశారని చెప్పారు. తిరిగి ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయించారని తెలిపారు. ఇసుకలో రూ.10 వేల కోట్ల దందా కొనసాగిందన్నారు. ల్యాండ్ టైటిల్‌యాక్టు ద్వారా ఆక్రమించుకున్న భూములను చట్టబద్దం క్రమద్ధీకరించేందుకు నాటి ప్రభుత్వం జీఓ తెచ్చిందని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఆ జీఓను రద్దు చేసిందని తెలిపారు. ఆక్రమిత భూములు కలిగిన వారు ఆ భూమి తమదని నిరూపించుకునేందుకు తమ ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు తెచ్చింద వివరించారు. ఆక్రమించిన ప్రతి రూపాయి టిడిపి ప్రభుత్వం వసూలు చేస్తోందన్నారు. టిడ్కో ఇళ్లలో మిగిలిన పనులు పూర్తి చేసి సాధ్యమైనంత వరకు లబ్దిదారులకు అప్పగించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో టిడిపి మైనార్టీ నేత క్రిసెంట్ జిలానీ బాష పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జడ్జి, బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రమాదాలకు గురికావొద్దు

- జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి భార్గవి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలకు గురికావద్దని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి కోరారు. గురువారం హెల్మెట్‌పై అవగాహన కల్పించేందుకు కోర్టు నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు జడ్జి నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. ప్రొద్దుటూరు ఆర్టీఒ వాహనదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు, న్యాయవాదులు, ఎక్సైజ్ సిఐ, అర్బన్, రూరల్ సిఐలు, సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు, ఎన్‌సిసి కమాండర్ పాస్టర్ రాజు, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో పోట్లగిత్త సినిమా విడుదల

ప్రజాశక్తి - వేంపల్లె

వెంకట్ దర్శకత్వంలో మానస్ హీరోగా నిర్మించిన పోట్లగిత్త సినిమా త్వరలో విడుదల అవుతుందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. పోట్లగిత్త సినిమాలో హీరో తండ్రి పాత్ర, ప్రధానపాత్రధారుడిగా తులసిరెడ్డి నటించారు. పులివెందుల నియోజకవర్గం చింతల జూటూరుకు చెందిన సింగం మహేశ్వర్‌రెడ్డి ఎర్ర చందనం స్మగ్లర్ వీరప్ప పాత్రలో నటించినట్లు చెప్పారు. ఈ సినిమా సంగమేశ్వర దేవస్థానం, సిద్ధవటం మండలం రేణుకమ్మ తల్లి దేవస్థానం, అనిమెల, పెద్దనపాడు, గొల్లల గూడూరు, కోరగుంటపల్లె, పులివెందుల పట్టణ గ్రామాల్లో సినిమా షూటింగ్ జరిగిందని తులసిరెడ్డి వివరించారు. వృక్షాలను మనం కాపాడితే.. అవి మనలను రక్షిస్తాయనే కాన్సెప్ట్‌తో సినిమా తీశారన్నారు. హైదరాబాద్‌లోని డిబి స్టూడియోలో తాను డబ్బింగ్ చెప్పినట్లు తెలిపారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కరెంట్ కోతలు పెడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని జమ్మలమడుగు సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు జి.ఏసుదాసు, దాసరి విజయ్ పేర్కొన్నారు. స్థానిక ఎల్జీఓ హోంలో గురువారం వారు మాట్లాడుతూ జమ్మలమడుగు పరిసర మండలాల్లో రాత్రివేళ తీవ్రమైన కరెంటు కోతలు అధికంగా ఉన్నాయన్నారు. పట్టణంలో కూడా గంటల తరబడి కరెంటు పోతోందన్నారు. సామాన్య ప్రజలు, ఆస్పత్రుల్లో రోగులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. చిన్నపాటి గాలి వర్షం వచ్చినా గంటల తరబడి కరెంటు రావడం లేదన్నారు. విద్యుత్ సంబంధిత కరెంటు ఆఫీసుకు ఫోన్ చేస్తే సమాధానం ఉండడం లేదన్నారు. లైన్‌మెన్, సీసీ ఫోన్ చేస్తే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాబు, శీను, శేఖర్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక జిల్లా పరిషత్ బాలికల అప్‌గ్రేడ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఇంటర్ కళాశాలలో పనిచేస్తున్న యుటిఎఫ్ నాయకుడు, తెలుగు అధ్యాపకుడు చెరుకూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా దాత చెరుకూరి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న 55 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్ అందజేశామని తెలిపారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా కష్టపడి చదవాలని కోరారు. పిజెఆర్ ఉపాధ్యాయులు వెంకట్, గుర్నాథ్‌రెడ్డి, సురేష్‌కుమార్ రెడ్డి, రమేష్, రెడ్డిశేఖర్, రాధా పాల్గొన్నారు.

రేపటి నుంచి పాతచోటే పశువుల సంత

ప్రజాశక్తి - మైదుకూరు

పశువుల సంత పాతచోట నంద్యాల రోడ్డులోనే ఈనెల 20 నుంచి నిర్వహించనున్నారు. గతంలో వైసిపి హయాంలో పశువుల సంతను బద్వేల్ రోడ్డులోని గగ్గితిప్ప వద్ద నిర్వహించేవారు. ప్రభుత్వం మారడం, ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో టిడిపి కౌన్సిలర్లు పశువుల సంతను నంద్యాల రోడ్డు మార్కెట్ యార్డ్ వద్ద కొనసాగించాలని ఏకగ్రీవంగా కోరారు. ఆ మేరకు టిడిపి నేతలు వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఏర్పాట్లు చేశారు.

సర్పంచ్ బాధ్యతలు చేపట్టేందుకు అనుమతినివ్వాలని వినతి

ప్రజాశక్తి - చాపాడు

చియ్యపాడు గ్రామ సర్పంచ్ తప్పెట శివప్రసాద్ ఆరు నెలల క్రితం ఆరోగ్యం సరిగా లేదని సెలవు పెట్టారు. ప్రస్తుతం తన ఆరోగ్య సమస్యలు తీరాయని మళ్లీ సర్పంచ్‌గా బాధ్యతలు చేపడతానని పంచాయతీ కార్యదర్శికి, పంచాయతీ ఉన్నత అధికారులకు విన్నవించారు. సెలవు రద్దు కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఆరునెలలుగా ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా ఓబులేసు బాధ్యతలు చేపడుతున్నారు. సర్పంచ్ సెలవు రద్దు కోరడంతో అధికారులు చర్యలు చేపట్టనున్నారు. గురువారం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌కు శివప్రసాద్ వినతిపత్రాన్ని అందజేశారు.

ఘనంగా పీర్ల పండుగ

ప్రజాశక్తి - వేంపల్లె



వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లెలో గురువారం పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీక మొహరం కావడంతో హిందు, ముస్లింలు కలిసి పండుగ చేసుకొన్నారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఎస్పీ జయరామిరెడ్డి, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి పీర్ల చావిడిలో నిలబెట్టిన ఇమామ్ హుస్సేన్ పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంపల్లె గ్రామం మీదుగా పాపాఘ్ని నది సమీపంలోకి పీర్లను జల్దీకి తీసుకెళ్లారు. కత్తులూరు, పాములూరు గ్రామాల్లో మస్తాన్ పీర్లకు ఊరేగింపు చేశారు. పీర్లకు ఊరేగింపులో పాలకుమార్, సుబ్బారెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

దుల్హన్ పథకంలో నిబంధనలను సడలించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ముస్లిం మైనారిటీ పేదల వివాహాల ఆర్థికసాయం కోసం గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన దుల్హన్ పథకానికి సంబంధించి సడలింపులు ఇచ్చి అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా టిడిపి మైనారిటీ విభాగం సంయుక్త కార్యదర్శి కమలాపురం గౌస్ మొహిద్దీన్ కోరారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమం, న్యాయ శాఖ మంత్రి జనాబ్ ఫరూక్‌ను కలిసి మైనారిటీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వైసిపి పాలనలో దుల్హాన్ పథకం కింద వధువుకు పదవ తరగతి అర్హతగా నిబంధన పెట్టారని, చాలా మందికి అర్హత ఉన్నా అందలేదన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా పరిగణలోకి తీసుకొని మంజూరు చేయాలని గౌస్ కోరారు.



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న గౌస్ మొహిద్దీన్

అందుబాటులోలేని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



ఊరికి దూరంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గ్రామానికి దూరంగా ఉంది. ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గ్రామ మధ్యలో ఉండేది. వైసిపి ప్రభుత్వ పాలనలో దీన్ని జన సంచారంలేని ప్రాంతం ఓ ప్రయివేటు భవనంలో ఏర్పాటు చేశారు. భూములు, ఇంటి స్థలాలు, ఇళ్లు కొనుగోలు చేసిన వారు డబ్బులు తీసుకొని గ్రామానికి దూరంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలంటే హడలి పోతున్నారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించారు. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మాత్రం కొన్నేళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. దీంతో ప్రభుత్వ ధనం ప్రయివేటు పరమవుతోందని పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వేంపల్లెలోని పాత మార్కెట్ సమీపంలో ప్రభుత్వానికి సంబంధించిన వెలుగు భవనం ఖాళీగా ఉంది. ఆ ప్రాంతంలోనే సచివాలయం కూడా ఉంది. ఆ భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. బ్యాంకులు కూడా దగ్గరగా ఉంటాయని పేర్కొంటున్నారు. చలానాలు కట్టేందుకు ఇబ్బందులు ఉండవని అంటున్నారు. లేఖరులు పంచాయతీకి సంబంధించిన గదుల్లో ఉండవచ్చు. పాత మార్కెట్ సమీపంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి అన్ని రకాలా సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెళ్లాలంటే తప్పకుండా ఏదైనా వాహనం ఉండాల్సిందే. సిబ్బంది కార్యాలయానికి వెళ్లాలన్నా ఆటో ఎక్కాల్సిన పరిస్థితి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలించి ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలని పలువురు అధికారులను, అధికార పార్టీ నాయకులను కోరుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలి

వేంపల్లె గ్రామం వెలుపల ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలి. ప్రస్తుతం ఉన్న కార్యాలయానికి రక్షణ, భద్రత లేదు. జన సంచారం లేని ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం మధ్యలో ఉన్న ఖాళీ భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మారిస్తే పంచాయితీకి ఆదాయం కూడా వస్తుంది. ప్రజలు, రైతులను దృష్టిలో పెట్టుకొని అధికారులు కార్యాలయాన్ని మార్చాలి.

- జయచంద్రారెడ్డి - వేంపల్లె

నాలుగు సార్లు ఢిల్లీ వెళ్లినా ఏం ప్రయోజనం

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాలుగు సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసినా ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి ప్రయోజనం కలగలేదని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'పుల్లన్న పులివెందుల సంతకు పోనూ పోయాడు.. రానూ వచ్చాడు ఒట్టి చేతులతో' అన్నట్లుంది సిఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన అన్నారు. 40 రోజుల్లో 4 సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చినా సాధించింది ఏమీ లేదన్నారు. రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేకహోదా సాధించలేదని తెలిపారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కూడా లేదన్నారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఊసేలేదన్నారు. దుగ్గరాజపట్నం కొత్త ఓడ రేవు అడ్రస్సే లేదన్నారు. విశాఖ, విజయవాడ మెట్రో రైళ్లు రాకపోవడంతోపాటు విశాఖ రైల్వేజోన్ కనిపించలేదని ఆయన విమర్శించారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ లేదన్నారు. కేంద్రంలో బిజెపికి పూర్తి మెజార్టీ లేకపోవడంతో చంద్రబాబుపై మోడీ ప్రభుత్వం మనుగడ ఆధారపడి ఉందన్నారు. కేంద్ర మంత్రివర్గ కూర్పులోనే ఆధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన విభజన చట్టాలను రాబట్టేందుకు కృషి చేయాలని టిడిపి ప్రభుత్వాన్ని తులసిరెడ్డి కోరారు.

మఠం పుణ్యక్షేత్రంలో బెల్ట్‌షాప్‌ల జోరు

మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం - కల్తీ మద్యంతో ప్రాణాలతో చెలగాటం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీమద్విరాట్ పోతులూరి వీం బ్రహ్మేంద్రస్వామి మఠంలో బెల్ట్‌షాపులు జోరుగా నడుస్తున్నాయి. బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు మూడుపువ్వులు.. ఆరుకాయలు అన్నట్లు ఉంది. పుణ్యక్షేత్ర ప్రాంతంలో మద్యం అమ్మకాలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏడు కిలోమీటర్ల తర్వాత మల్లెపల్లెలో ప్రభుత్వ వైన్‌షాపు ఏర్పాటు చేశారు. అయితే కొందరు అనధికారికంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. పలుమార్లు పత్రికల్లో వచ్చినప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. మద్యం ప్రియులు ఫుల్లుగా సేవించి మాఢ వీధుల్లో దుస్తులు కూడా సరిగా లేకుండా పడిపోయిన సందర్భాలు కోకొల్లలు. ఆధ్యాత్మికంగా స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అడుగడుగున మద్యం అమ్మకాలు, తాగి పడిపోయిన వ్యక్తులే దర్శనమిస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే వారి అనుచరులు బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలు చేస్తూ.. అధికారులకు మామూళ్లు ఇస్తూ విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తూ ఉంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యాన్ని కల్తీ చేస్తూ అమ్మకాలు చేస్తున్నారు. పొగాకు నీళ్లను మద్యంలో కలుపుతున్నారు. సగం మద్యం, సగం పొగాకు నీళ్లను సీల్ చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఈ మద్యం తాగిన వారికి నరాల బలహీనత. గతంలో చాలామంది చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ సొంత మండలంలోని పుణ్యక్షేత్రంలో మద్యం అమ్మకాలు నిషేధిస్తే సంతోషిస్తామంటూ ప్రజలు ఎమ్మెల్యేను కోరుతున్నారు. మామూళ్లకు పాల్పడి బెల్ట్‌షాపులకు అనుమతిచ్చిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



బ్యానర్‌ను విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జాతీయ కుష్టు నివారణ పక్షోత్సవాలను విజయవంతం చేద్దామని డాక్టర్ స్నేహ ప్రత్యూష పిలుపునిచ్చారు. రాష్ట్ర వైద్యశాఖ ఆదేశాల మేరకు పట్టణంలోని నగరిగుట్ట ప్రాథమిక వైద్యాశాల ఆవరణలో గురువారం జాతీయ కుష్టు నివారణ పక్షోత్సవాలను ప్రాథమిక వైద్యాశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ ప్రత్యూష, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్నేహ ప్రత్యూష మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రతి ఆశా వర్కర్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, సూపర్ వైజర్లు మెడికల్ ఆఫీసర్స్ ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించాలన్నారు. బాధితులకు అవగాహన కల్పించాలన్నారు.

చాపాడు : కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ రహంతుల్లయ్య కోరారు. మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధికి సంబంధించి అవగాహన కల్పిస్తూ వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రాజేష్‌కుమార్, ఓబులేసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. చాపాడు మండలాన్ని కుష్టు వ్యాధి రహితంగా ఉండేందుకు అందరూ కృషి చేయాలని వారు పేర్కొన్నారు. అల్లాడుపల్లెలో అంటువ్యాధులు ప్రబలకుండా అవగాహన కోసం దండోరా వేయించామని పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్ తెలిపారు. ఎంఇఒ వంశీ కృష్ణ, ఈఓపిఆర్డీ రాధాకృష్ణవేణి, ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ, సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, మండల ఆరోగ్యవిస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్స్ బాబురెడ్డి, సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మార్కెట్ షెడ్లలో వ్యాపారం చేయండి

జమ్మలమడుగు రూరల్ : మార్కెట్ వ్యాపారులు మార్కెట్ షెడ్లలో వ్యాపారం చేసుకోవాలని మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంబాబు తెలిపారు. గురువారం స్థానిక సంజామల మోటులో వెజిటబుల్ మార్కెట్‌ను మున్సిపల్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్లలో కాకుండా రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దన్నారు. ఆర్ఐ, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపయోగంలేని యాప్‌లు రద్దు చేయాలి

ప్రొద్దుటూరు : బోధనకు ఆటంకం కలిగిస్తున్న యాప్‌లు, శిక్షణా కార్యక్రమాలను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. పలు యాప్‌ల వల్ల విద్యా బోధన కుంటుపడుతోందన్నారు. ఉపాధ్యాయుల హాజరు నమోదు యాప్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

గ్రామాల్లో కనీస వసతులు కల్పించండి

-మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన కనీస సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోపవరం, కామనూరు, కొర్రపాడు తదితర గ్రామాల్లో రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు వంటి కనీస సదుపాయాలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు పంటలపై అవగాహన కల్పించేలా గ్రామాల్లో సభలు నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను అలక్ష్యం చేయకుండాఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపిపి శేఖర్ యాదవ్, ఇన్‌ఛార్జి జడ్పీ చైర్మన్ జేస్తాది శారద, డిఎల్‌డిఒ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కుళాయమ్మ పాల్గొన్నారు.

పింఛను అర్హతపై ఇంటింటి సర్వే

చాపాడు : మండలంలోని మడూరు గ్రామంలో పెన్షన్ అర్హతపై గురువారం ఇంటింటి సర్వే చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పాల్గొ న్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మడూరు సచివాలయ పరిధిలోని మడూరు, చిన్న వరదాయపల్లి గ్రామాల్లో తమ సిబ్బందితో ఇంటింటి సర్వే చేపట్టామన్నారు. పెన్షన్ లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నామన్నారు.

విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

వేంపల్లె : ఎపి క్రికెట్ సెలెక్టర్ పైడికాల్వ విజయ్‌కుమార్‌పై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని నేతి గురుప్రసాద్ కోరారు. గురువారం కడప నగరంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ అవ్వారురెడ్డి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ తరుపున తన కుమారుడు నేతి గురుచరణ్ క్రికెట్ పోటీలు ఆడుతున్నట్లు చెప్పారు. అండర్-19 రాష్ట్ర స్థాయిలో క్రికెట్ పోటీల్లో ఆడిస్తానని తన కుమారునికి పైడికాల్వ విజయ్‌కుమార్ ఆశ చూపి రూ.10 వేలు తీసుకున్నారని ఆరోపించారు. కానీ కడప క్రికెటర్లకు అన్యాయం చేసి హైదరాబాద్ క్రికెటర్లు వద్ద భారీగా డబ్బులు తీసుకొని వారితో ఆడిస్తున్నట్లు చెప్పారు. విజయ్‌కుమార్‌ను క్రికెట్ బాధ్యతల నుంచి తొలగించి కడప క్రీడా కారులకు న్యాయం చేయాలని కోరారు.

గెస్ట్ ప్యాకల్టీ హోదాను మార్చాలి

వేంపల్లె : ఆర్‌జెయుకెటి పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటిల్లో పని చేస్తున్న గెస్ట్ ప్యాకల్టీలకు డిజిగ్నేషన్ మార్చాలని కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ కోరారు. గురువారం కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డిని యర్రగుంట్లలో కలిసి వినతిపత్రం అందజేశారు. 2018 కాంట్రాక్టు ఫ్యాకల్టీ నోటిఫికేషన్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయినట్లు ఎమ్మెల్యేకు చెప్పారు. సెలెక్ట్ అయిన ప్యాకల్టీకి గెస్ట్ ఫ్యాకల్టీ అని డిజిగ్నేషన్ ఇచ్చారన్నారు. 2018 నుంచి తమపై జరుగుతున్న దాడులు, పనిభారంతో మానసిక ఒత్తిడి, క్షోభకు గురవుతున్నామని వివరించారు. పనికి తగ్గ వేతనం ఇప్పించాలని కోరారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

పులివెందుల టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపిడిఒ దివాకర్ సూచించారు. గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ ఉంటుందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల వారణకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి పైప్‌లైన్లు లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. డయేరియా బారిన ప్రజలు పడుతున్నారని, ముందస్తు చర్యలుగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.



కౌంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆది, భూపేష్‌రెడ్డి

అందుబాటులో నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి - ముద్దనూరు

పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జమ్మలమగుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, నియోజకవర్గ టిడిపి నాయకులు భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని కెవిఎంఆర్ కాంప్లెక్స్‌లోని సూపర్ మార్కెట్, నాలుగు రోడ్ల వద్ద ఉన్న సూపర్ మార్కెట్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను గురువారం ఎమ్మెల్యే, భూపేష్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు ధరలు బహిరంగ మార్కెట్‌లో కంటే తక్కువ ధరకే విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు డాక్టర్ మధుసూదనరెడ్డి, తహశీల్దార్ సువర్ణదేవి, ఎంపిడిఒ చంద్రమోళీశ్వర్, సిఐ దస్తగిరి, సివిల్ సప్లయర్స్ ఎన్ఫోర్స్‌మెంట్ డిటి వరదకిషోర్ రెడ్డి, ఎస్ఐ మైనుద్దీన్, ఈఓ పిఆర్డీ వీరభద్రుడు, వెలుగు ఎపిఎం ఇబ్రహీం, మండల కూటమి నాయకులు సురేంద్రనాథ్ రెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, గోపాలకృష్ణ, రామ కృష్ణారెడ్డి, పెద్ద మాబు, చిన్నమాబు, సాయి, సత్తార్, వినోద్, సురేష్, మహిళలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ చిక్కితే రూ.లక్షకు తగ్గకుండా జరిమానా వేయండి

- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు రూరల్ : ఇసుక ట్రాక్టర్ పట్టుబడితే రూ.లక్షకు తగ్గకుండా జరిమానా విధించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచించారు. స్థానిక బి.మార్ట్, ఇ.మార్ట్, కె.మార్ట్‌లలో ఉచిత బియ్యం, కంది బేడల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ సహజ వనరులను యథేచ్ఛగా దోచుకోవడం తమ పార్టీ నాయకులు కానీ, కార్యకర్తలు కానీ, ఇతర పార్టీల నాయకులుగానీ, కార్యకర్తలుకానీ చేయరాదన్నారు. ఇసుక ట్రాక్టర్లు పట్టుబడితే తానుగానీ, భూపేష్ రెడ్డిగానీ సహకరించబోమని పేర్కొన్నారు. త్వరలోనే మద్యం పాలసీ కూడా మారుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు వైసిపిని 11 సీట్లకే పరిమితం చేసినా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, ఆర్డిఒ శ్రీనివాసులు, అర్బన్, రూరల్ సిఐలు, టిడిపి, బిజెపి, జనసేన నేతలు పాల్గొన్నారు.

జగన్, సుధీర్‌ను రాజకీయాల నుంచి శాశ్వతంగా తరమాలి

ఎర్రగుంట్ల : మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని రాజకీయాల నుంచి శాశ్వతంగా తరిమేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అన్నారు. పట్టణంలోని టిఎంఆర్ మాల్‌లో ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న కందిపప్పు, స్టీమ్ రైస్, సన్న బియ్యం అమ్మకాలను గురువారం ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి ప్రారంభించారు. ఎర్రగుంట్లకు బైపాస్ రోడ్డు నిర్మించి ట్రాఫిక్ సమస్యను తొలగిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, మండల ఇన్‌ఛార్జి మధుసూదన్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, కూటమి నాయకులు మేకల జగన్‌మోహన్ రెడ్డి, సూర్య నారాయణరెడ్డి, రమేష్‌రెడ్డి, కె శ్రీను, బయపరెడ్డి, కత్తి ప్రతాప్‌రెడ్డి, కోడూరు శివారెడ్డి, ఎంపిటీసీ నవీన్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ప్రజలు, కార్యకర్తలతో మమేకమయ్యారు. ప్రజల నుంచి వచ్చిన వినతలను స్వీకరించి, సంబంధిత అధికారులతో ఫోన్లో వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన ఎప్పుడూ ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. అర్హతగల ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందాలనేదే ప్రభుత్వ ఆశయమని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలకు ప్రభుత్వం ఎప్పటికీ అండగా ఉంటుందని తెలిపారు.

నకిలీ ఎరువులు, పురుగు మందులు అమ్మితే చర్యలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ముద్దనూరు ఎడిఎ వెంకటసుబ్బయ్య, ఎఒ నాగలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నకిలీ మందులు, ఎరువులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు ఇవ్వాలని తెలిపారు.